జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ
గురువారం | 23 | ఏప్రిల్ | 2026 • పేజీలు : 10



## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 22, (ప్రజా జ్యోతి)** భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు.బుధ వారం హనుమకొండ

మిగతా 2 లో...




2 లో..

# పర్వతగిరిలో మద్యం...

### నిబంధనలు బూడిద..!

# సిండికేట్ రాజ్యం...

పర్వతగిరి మండల కేంద్రంలో మద్యం వ్యాపారుల సిండికేట్ దందా బహిరంగంగా సాగుతోంది. అధికారులు చూస్తూ చూస్తూ మౌనం వహిస్తుండటంతో అక్రమాలకు రెక్కలు వచ్చాయి. నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమైపోయి, వ్యాపారుల ఇష్టారాజ్యం నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

• పర్వతగిరి, ప్రజాజ్యోతి

## హీట్ వేవ్ ముప్పుకు ముందస్తు చర్యలకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్



**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి ):** జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆమె పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సంబంధిత మున్సిపల్, ఇరిగేషన్ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో షేడ్‌లు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, వడ దెబ్బ కేసులకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, అగ్నిమాపక, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ, మునిసిపల్, గ్రామీణ అభివృద్ధి, విద్య, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో

మిగతా 2 లో...

### మంగపేట మండలంలో

# గాలి వాన భీభత్సం

- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



**మంగపేట ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):** మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుండి ఎండవేడిమితో అల్లాడిన మండల వాసులకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకొన్నాయి. దేశ వ్యాప్తంగా ఎల్నినో కారణంగా తీవ్ర ఎండలు కొనసాగుతుండగా బుధ వారం సాయంత్రం ఒక్కసారిగా ములుగు జిల్లా మంగపేట మండల వ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. కమలాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భారీ వృక్షం చెట్టు కొమ్మలు విరిగి ఆర్&బి రోడ్డుపై పడడంతో విద్యుత్ సరఫరా

మిగతా 2 లో...

## ధాన్యం కొనుగోళ్లలో టోకెన్ విధానాన్ని సరిగా అమలు చేయాలి

- బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- తాగునీటి నాణ్యతపై పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి
- ఆర్టీసీ బస్ స్టాండ్ సందర్శన ప్రయాణికులకు ఇబ్బంది కలగద్దు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):** జనగామ మండలంలోని చౌడారం గ్రామ పంచాయతీ పరిధిలో గల టీజీఎంఎస్, పాఠశాల జూనియర్ కళాశాల, పీఎం శ్రీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మిగతా 2 లో...

## హీట్ వేవ్ ముప్పుకు ముందస్తు చర్యలకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

పనిచేస్తూ హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వేడి తీవ్రత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, కార్మికులు జాగ్రత్తగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్వో విజయ లక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంగపేట మండలంలో గాలి వాన భీభత్సం







(మొదటి పేజీ తరువాయి...)

ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్, పోలీస్ సిబ్బంది విద్యుత్ తీగలపై పడ్డ చెట్టు కొమ్మలను, విరిగిన స్థంబాలను పునరుద్దరించే పనిలో ఉన్నారు. ఇదిలా ఉండగా అకాల వర్షం రైతులను ఆగం చేసింది. ఓ వైపు మండలంలో కొనుగోలు కేంద్రాలు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి, రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నా, వరుణుడి భారి నుంచి రైతు తప్పించుకో లేకపోయాడు. మండల వ్యాప్తంగా వర్షం కారణంగా కోత దశలో ఉన్న వరి పంటలు, కోత కోసి కల్లాల్లోనే ఉన్న ధాన్యం కొంతమేరకు దెబ్బతిన్నాయి. చేతిక వచ్చిన పంట నీళ్ల పాలు కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట ప్రకృతి వైపరీతం కారణంగా నీటిపాలు కాగా, రైతులకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది. అకాలవర్షం కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలాని రైతులు కోరుతున్నారు.

## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన “ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ (ఏప్రిల్ 15–30)” పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూకాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్న మదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.






# పర్వతగిరిలో మద్యం...

## నిబంధనలు బూడిద..!

# సిండికేట్ రాజ్యం...

**పర్వతగిరి మండల కేంద్రంలో మద్యం వ్యాపారుల సిండికేట్ దందా బహిరంగంగా సాగుతోంది. అధికారులు చూస్తూ చూస్తూ మౌనం వహిస్తుండటంతో అక్రమాలకు రెక్కలు వచ్చాయి. నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమైపోయి, వ్యాపారుల ఇష్టారాజ్యం నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**



● పర్వతగిరి, ప్రజాజ్యోతి

### ››› సిండికేట్ గూటిలో మద్యం వ్యాపారం

మండలంలోని పలు వైన్ షాపుల యజమానులు ఒక్కటై సిండికేట్‌గా మారి మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లు సమాచారం. ధరల నియంత్రణ నుంచి సరఫరా వరకు అన్నీ ఈ సిండికేట్ ఆధీనంలోనే నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ››› స్టిక్కర్ల మాయాజాలం.. బెల్ట్ షాపులకు గుప్త సరఫరా

నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక స్టిక్కర్లు ముద్రించి తమ సొంత వాహనాల్లోనే మద్యాన్ని బెల్ట్ షాపులకు నేరుగా సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్లముందే ఈ అక్రమాలు జరుగుతున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.మండలంలోని పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు వెలిసిపోవడంతో మద్యం ఏరులై పారుతోంది. సాయంత్రం వేళ గ్రామాలు మద్యం కేంద్రాలుగా మారుతున్నా పట్టించుకునే వారే లేరు.

### ››› బలైపోతున్న యువత.. చిచ్చు పడుతున్న కుటుంబాలు

బెల్ట్ షాపుల విస్తరణతో మారుమూల గ్రామాల్లో కూడా మద్యం సులభంగా దొరుకుతోంది. దీంతో యువత మద్యానికి బానిసలై తమ భవిష్యత్తును చీకట్లోకి నెట్టుకుంటున్నారు. పచ్చని సంసారాల్లో కలహాలు పెరిగి కుటుంబాలు కుదేలవుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

### ››› ఎక్సైజ్ శాఖ మౌనం ఎందుకు?

మద్యం సిండికేట్ దందా బహిరంగంగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? బెల్ట్ షాపులపై ఎప్పుడు ఉక్కుపాదం మోపుతారన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

## ధాన్యం కొనుగోళ్లలో టోకెన్ విధానాన్ని సరిగా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

బుధవారం సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్, ఐటీ ల్యాబ్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించి, ఏ ఏ పుస్తకాలు ఉన్నాయి అని లైబ్రేరియన్ ని అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఖచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. బడి బాట కార్యక్రమాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకోసారి తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. శుభ్రమైన నీరు.. ఆరోగ్యానికి ఆధారం అని తెలిపారు. అనంతరం జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో టోకెన్ల వారీగా జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి, కేంద్ర నిర్వాహకులను, ఏఈఓను కలెక్టర్ అభినందించారు. ఎండ దెబ్బ తగలకుండా రైతులు, అధికారులు, ఇతర సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ధ్యానం కాంటా వేసే విధానాన్ని పరిశీలించి, ఎప్పటికప్పుడు దాన్యం బస్తాల తూకం పూర్తిచేసి, సంబంధిత మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. తదనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌ను కలెక్టర్ సందర్శించి, పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. బస్ స్టాండ్‌లో తాగునీటి సదుపాయాలను పరిశీలించి, అక్కడ అందిస్తున్న తాగునీటి నాణ్యతను స్వయంగా పరీక్షించేందుకు నీటిని తాగి, పరిశుభ్రత, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికులు వేచి ఉండే సమయం తగ్గించేలా టికెట్లు వేగంగా జారీ చేయాలని, ఆలస్యం లేకుండా బస్సులు నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలు ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు సామాజిక సేవలో ముందుండాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 22, (ప్రజా జ్యోతి)** వయోవృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. బుధవారం హనుమకొండ జడ్పీ హాల్ ప్రాంగణంలో ఉన్న వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హనుమకొండ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ (టెస్కాన్), హైదరాబాద్ సౌజన్యంతో రాగి జావ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, వయోవృద్ధులు డే కేర్ సెంటర్లలో అందుబాటులో ఉన్న పుస్తక పఠనం, ఫిజియోథెరపీ, వినోద కార్యక్రమాల వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. తమ జీవిత అనుభవాలను, వివిధ





రంగాల్లోని జ్ఞానాన్ని సమాజానికి పంచాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ, వయోవృద్ధులకు చట్టపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ట్రిబ్యునల్ వ్యవస్థ అందుబాటులో ఉందని చెప్పారు.ట్రిబ్యునల్ సభ్యురాలు అనితా రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం – 2007" ద్వారా వయోవృద్ధులకు అనేక హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఉన్న ట్రిబ్యునల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ అధ్యక్షులు దామెర నర్సయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం వరంగల్ అధ్యక్షులు, కార్యదర్శులు అన్నూరి చంద్ర మౌళి, దేవాచారి, బన్నూ ఆరోగ్యదా సేవా సొసైటీ కార్యదర్శి కిరణ్మయి, సి.డబ్ల్యూ.సి సభ్యులు కజాంపురం దామోదర్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగులగాం నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కోన్ రెడ్డి మల్లారెడ్డి, సిరాజుద్దీన్, నీతా, శ్రీధర్, హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ ప్రాంత సీనియర్ సిటిజన్స్ సంస్థల ప్రతినిధులు, వివిధ సంస్థల బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## పరకాలలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం





**పరకాల, ఏప్రిల్ 22, (ప్రజాజ్యోతి ):** పరకాల పట్టణంలోని లలిత మినీ కన్వెన్షన్ హాల్లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా పార్టీ పరిస్థితులు, కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు.రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే వార్డుల వారీగా నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు పరకాల పట్టణ కమిటీని కూడా ఎన్నుకోవడం జరుగుతుందని వెల్లడించారు.పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ "పార్టీ బలం కార్యకర్తలే. మీరు ప్రతి ఒక్కరూ ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలి. మన పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉంది, దాన్ని మరింత పెంచే బాధ్యత మన అందరిదీ. వార్డుల స్థాయిలో బలమైన నిర్మాణం ఉంటేనే పట్టణ స్థాయిలో విజయం సాధించగలం. అందుకే త్వరలోనే వార్డుల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్తకు బాధ్యతలు అప్పగిస్తాం.జగిత్యాలలో నిర్వహించిన కేసీఆర్ సభతో పార్టీకి మరింత బలంచేకూరిందన్నారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయారని తెలుసుకున్నారని మళ్ళీ కేసీఆర్ ను సీఎం గా చూడాలని నిర్ణయించుకొన్నారు.రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు.

## నడికూడలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రలు ప్రారంభం





**పరకాల, ఏప్రిల్ 22, (ప్రజా జ్యోతి ):** నడికూడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, మార్క్ఫెడ్ సౌజన్యంతో మాదా రం ఆధ్వర్యంలో, నార్లాపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం, మార్క ఫెడ్ ఆధ్వర్యంలో హకా ఎఫ్ ఎస్ సి ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళాలను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి లాభం పొందాలని సూచించారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధరగా రూ. 2400 ఇవ్వనున్నట్లు, వారి ధాన్యానికి రూ.2389, 2369లు మద్దతు ధర వెల్లడించారు.కార్యక్రమంలో నడికూడ తహసిల్దార్ రాణి, సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, పిఎసిఎస్ సీఈవో రాజేందర్, ఏపిఎం నాగేశ్వరరావు, నార్లపూర్ గ్రామ సర్పంచ్ రవీందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, నాయకులు పర్నం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు డబ్బులు రాక పడిగాపులు



**శాయంపేట ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు గత మూడు నెలలుగా చేసిన పనులకు డబ్బులు రాక, అసలు ఎప్పుడు వస్తాయో తెలియక ఆర్థికంగా ఇబ్బందితో పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బహుజన సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మారేపల్లి సుధాకర్ మాట్లాడుతూ 100 రోజుల పని చేస్తున్న కూలీలకు సకాలంలో డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 100 రోజుల కూలీలు ఉదయాన్నే ఐదు గంటలకు లేచి గడ్డపార, పారా, డబ్బాలు చేత పట్టుకొని ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎర్రటి ఎండలో పనిచేస్తూ చేతులకు కాయలు కాసేలా కష్టపడి పనిచేసి ఇంటికి బియ్యం కొనుక్కొని పోదామంటే చేసిన పనికి సమయానికి డబ్బులు అందక, ఈ పనికి వస్తే తిరిగి వేరే పని చేసే సమయం లేక చేసిన పనికి ఎప్పుడు డబ్బులు వస్తాయో తెలియక, గత మూడు నెలలుగా ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని అన్నారు. పనిచేసే ప్రాంతాలలో కనీసం వాటర్ సౌకర్యం, వైద్య సౌకర్యం, కనీసం నీడ సౌకర్యం కూడా లేకుండా, ఎర్రటి ఎండలో మాడిపోతున్నామని అన్నారు, ముఖ్యంగా పనిచేసే క్రమంలో ఏదైనా గాయాలపాలైతే మా సొంత ఖర్చులతో భరించాల్సిందే తప్ప ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలియజేశారు. వందరోజుల పని పైనే ఆధారపడి ఉన్నాం కాబట్టి మూడు నెలలుగా డబ్బులు రాక చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి తక్షణమే మా డబ్బులను విడుదల చేసి మా ఖాతాలో వేయాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ధైనంపెల్లి సుమన్, నడిగోట్టు వీరస్వామి, రమేష్, సునీత, సుజన, సదానందం, సారయ్య, సమ్మయ్య, సాంబయ్య, కొమురయ్య, మరియు కూలీలు పాల్గొన్నారు.

## అధికారుల పనితీరుతోనే ప్రభుత్వానికి పేరు





**పరకాల, ఏప్రిల్ 22, (ప్రజా జ్యోతి ):** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ అధికారులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచనలు చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే గ్రామపాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వారి పనితీరును బట్టి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు.గ్రామ స్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని తెలిపారు.వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కేంద్ర –రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గంజాయి నిర్మూలనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతతో పనిచేయాలని అధికారులు కోరారు.

## నామినేటెడ్ పదవుల్లో సీనియర్ లకు అవకాశం ఇవ్వండి

- ఏఐసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడికి రాజభద్రయ్య వినతి

**హసన్ పర్తి, ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):** ఏఐసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులు రాజేంద్ర పాల్ గౌతమ్ ను టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు బందెల రాజభద్రయ్య డిల్లీ లోని జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుదవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాజభద్రయ్య రాజేంద్ర పాల్ గౌతమ్ కు



పూల బోకే అందించి సత్కరించారు.ఈ సందర్భంగా రాజభద్రయ్య తాను గత 34 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ, ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు కృషి చేశానని రాజేంద్ర పాల్ గౌతమ్ కు వివరించారు.రాజభద్రయ్య తనకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇచ్చుటకు సహకరించాలని రాజేంద్ర పాల్ గౌతమ్ ను కోరారు. ఈ సందర్భంగా రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ కొరకు మొదటి నుండి కష్టపడిన రాజభద్రయ్య కు నామినేటెడ్ పదవి ఇచ్చే విషయం అదీష్టానం దృష్టిలో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు బందెల రాజభద్రయ్య,నాయకులు సర్దార్ రాజశేఖర్,కొండల్ రెడ్డి, మంచాల దామోదర్,తదితరులు పాల్గొన్నారు.

## పోషణలోపం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

• మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 22)**పోషకాహార లోపం సమాజభివృద్ధికి అడ్డంకిగా మారకుండా పోషణలోపం లేని సమాజనిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని ఇప్పలపల్లి అంగన్వాడీ పాఠశాలలో ఐసిడిఎస్ సూపరవైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమానికి సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జి. మల్లేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పోషకాహార లోపం సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారకుండా ఉండేందుకు ప్రతి అంగన్వాడీ టీచర్ తన పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు.ఆకుకూరలు, పప్పులు, గుడ్లు, పాలు వంటివి తీసుకోవడం ద్వారా లభించే ప్రోటీన్స్, విటమిన్స్, మినరల్స్ మన శరీర రక్షణకు ముఖ్యమైనవని వీటి గురించి సమాజంలో అవగాహన పెంచి, పోషణలోపం లేని సమాజం నిర్మించడానికి అందరం కృషి చేయాలన్నారు.పౌష్టికాహారం పిల్లలకి చాలా అవసరమని ఆరు సంవత్సరాల లోపు పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు ఎక్కువ సంఖ్యలో హాజరు అయ్యేలా చూడాలన్నారు.జిల్లా ఇంచార్జి మిషన్ కో ఆర్డినటర్ క్రిష్ణ హెల్ప్ లైన్ నెంబర్ లు, సఖి అందించే సేవలు, ప్రతి అంగన్వాడీ హెల్ప్ లైన్ నంబర్లు అంగన్వాడీలో ప్రదర్శించాలని సూచించారు.పర్లపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో సమగ్రంగా కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్లందరికీ సూపర్ వైజర్ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కేతిపల్లి శిరీష తిరుపతి రెడ్డి,వార్డ్ మెంబెర్లు, సంక్షేమ శాఖ మహిళ సాధికారత సిబ్బంది, అనూష, మమత, సురేష్, అంగన్వాడీ టీచర్ లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడా కార్యక్రమం



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 22)**మండలకేంద్రంలోని నాలుగో అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 8వ జాతీయ పోషణ పక్వాడా కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఐసీఐడీస్ సూపరవైజర్ మాట్లాడుతూ పిల్లలకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు, చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారంలో భాగంగా చేర్చుకోవాలన్నారు.బయట తయారు చేసే జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, కూల్ డ్రింక్స్ దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మొబైల్ ఫోన్స్ కి చిన్నపిల్లలను దూరంగా ఉంచడం. పిల్లలకి ఫోన్ అలవాటు చేయడం ద్వారా వచ్చే దుష్ప్రభావాల గురించి వివరించారు. పిల్లలకి తినే టైంలో ఫోన్ చూడడానికి ఇవ్వకుండా కథలు,మంచి విషయాలు చెప్పుకుంటూ తినిపించాలని మూడు నుండి ఆరు సంవత్సరాల లో పిల్లలందరినీ కూడా అంగన్వాడి కేంద్రాలకి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఇద్దరు గర్భిణీలకు శ్రీమంతాలు, ముగ్గురు పిల్లలకి అక్షరాభ్యాసం ప్రోగ్రాం నిర్వహించి పోషణ పక్షం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్, గర్భిణీ మహిళలు, బాలింతలు, గ్రామంలోని మహిళలు, పిల్లలు, అంగన్వాడీ టీచర్స్ వెన్నెల, రజిత, స్వప్న, ఆశ వర్కర్, అంగన్వాడి ఆయా దమయంతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలి





• జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):**
హన్మకొండ జిల్లాలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్పర్సన్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు.వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు.ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో డీపీఆర్ఓ ఆయూబ్ అలీ, డిపూటి ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ అరుణ, డీఎంఎస్సి సభ్యులు గడ్డం కేశవమూర్తి, బీఆర్ లెనిన్, వల్లాల జగన్, సంతోష్, నయిమ్, బుచ్చిరెడ్డి, మధు, సుధాకర్, గోకారపు శ్యామ్, బొల్లా ఆమర్ పాల్గొన్నారు.

## ఘోష్ నివేదికపై ఉన్నత న్యాయస్థానం తీర్పు నిజాయితీకి నిదర్శనం

• బండి రజనీకుమార్



**హసన్పర్తి,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):**
ఘోష్ కమిషన్ నివేదికపై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు బీఆర్ఎస్ పార్టీ నిజాయితీకి నిదర్శనమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజినీ కుమార్ పేర్కొన్నారు. రాజకీయ అవసరాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం కొనసాగుతోందని విమర్శించారు.రాజకీయ కక్షసాధింపుల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేసిందని కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రాజకీయ కుట్రలను పక్కనబెట్టి రైతుల ప్రయోజనాల కోసం పనిచేసి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రెండున్నరేళ్లుగా కల్పతరువులాంటి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును అంగీకరించి రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. ఇది ఘోష్ కమిషన్ నివేదిక కాదని, పూర్తిగా కాంగ్రెస్ పార్టీ నివేదికేనని తమ పార్టీ ముందుగానే చెప్పిన విషయం ఈ రోజు నిజమైందని తెలిపారు.దేశ రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా గౌరవ న్యాయస్థానాలు సహించవని ఈ తీర్పుతో మరోసారి స్పష్టమైందన్నారు. ఘోష్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేయడంతో ప్రభుత్వ రాజకీయ కుట్రలకు అడ్డుకట్ట పడినట్లయిందని పేర్కొన్నారు.మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు స్తంభాలను వెంటనే మరమ్మతులు చేసి రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గోదావరి జలాలను ఇతర రాష్ట్రాలకు మళ్లించి తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తే రైతులు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ రైతులకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మోదీపై వ్యాఖ్యలు ఖండిస్తూ కర్గే దిష్టిబొమ్మ దహనం



**హసన్ పర్తి,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి):**భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ హసన్ పర్తి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో కర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 66వ డివిజన్ ప్రజా ప్రతినిధి గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తున్న నాయకుడు నరేంద్ర మోదీపై ఈ విధమైన అవమానకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ నిరాశాజనక రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. దేశ భద్రత, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధానమంత్రిని కించపరచడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని విమర్శించారు.మల్లికార్జున్ కర్గే చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమైనవని, బాధ్యతారహితమైనవని పేర్కొంటూ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెంబర్తి గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, రాష్ట్ర రైతు మోర్చా నాయకులు పెద్ది మహేందర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు జీల సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోయడ రాజు, ఉపాధ్యక్షుడు బలగని రవీందర్ గౌడ్, కార్యదర్శులు దాది మధుసూదన్, నాయకులు పెద్దమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## కిట్స్ వరంగల్ అధ్యాపకునికి డాక్టరేట్



**హసన్ పర్తి,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి ):**వరంగల్‌లోని కాకతీయ సాంకేతిక విజ్ఞాన విద్యాసంస్థలో ఈసీఐఈ విభాగానికి చెందిన సహాయ ఆచార్యుడు బొందల వేణు మహేశ్వరరావుకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదా నం చేసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి వెల్లడించారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తన పర్యవేక్షణలో వేణు మహేశ్వరరావు ఆధునిక సాంకేతిక పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. “పీపీజీ సంకేతాల మెరుగుదల మరియు విశ్లేషణకు సంబంధించిన సంకేత ప్రక్రియ పద్ధతులు” అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పొందినట్లు పేర్కొన్నారు.ఈ పరిశోధనలో అదనపు చలన సంచికాల అవసరం లేకుండా తరంగ మార్పిడి, అనుకూల వడపోత పద్ధతుల ద్వారా చలన లోపాలను తొలగించే విధానాన్ని అభివృద్ధి చేశా రు. అలాగే పీపీజీ సంకేతాల ద్వారా శ్వాస రేటు, రక్త ఆక్సిజన్ స్థాయిని ఖచ్చితంగా అంచనా వేసే సమిష్టి యాంత్రిక అభ్యాసం, లోతైన అభ్యాస నమూనాలను రూపొందించారు. ఊబకాయాన్ని అంచనా వేయడానికి కూడ ప్రత్యేక నమూనాను రూపొందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యక్షుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌కుమార్ తదితరులు వేణు మహేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమలరెడ్డి, పరిపాలనా అధికారి ప్రొఫెసర్ పి. రమేష్‌రెడ్డి, డీన్ ప్రొఫెసర్ ఎస్. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సహకారం

**• నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్**



**నర్సంపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** నర్సంపేట పట్టణ పరిధిలోని 9వ వార్డు స్థానికులు ఆకుతోట కళావతి కుటుంబానికి,శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి.ముఖ్య అతిథిగా హాజరై వారి సొంతింటి కల నెరవేరిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని,ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్నికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి,విడతల వారీగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుంది అని తెలిపారు.ఇది ప్రజా ప్రభుత్వమని,పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కి ఎల్లవేళల రుణపడి ఉంటామని తెలియజేస్తూ, మున్సిపల్ చైర్ పర్సన్ నీ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి రమేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్,కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మెర్గు కిరణ్,ఉప్పల శాలూమ్,దేవోజు హేమంత్,మైదం రాకేష్,చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ అకస్మిక తనిఖీ



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 22)**మండలకేంద్రంలోని 108 అంబులెన్సు ను జిల్లా మేనేజర్ రాజు నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడ దెబ్బ తగిలే ప్రభావంతో రోగుల సంఖ్య పెరుగుతున్నందున తక్షణమే అప్రమత్తంగా ఉండాలని గర్భిణీ స్త్రీలను ప్రసవం కోసం ఆసుపత్రికి తరలించి మళ్లీ ఇంటికి సురక్షితంగా చేర్చాలని సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వాహనంలో ఉన్నటువంటి వైద్య పరికరాలను వివిధ రకాలైన మందులను పరిశీలించి వాహనం యొక్క స్థితిగతులను తెలుసుకొన్నారు. రికార్డులను పరిశీలించి అత్యవసర పరిస్థితిలో ఎలాంటి ఫోన్ కాల్ వచ్చిన వెంటనే స్పందించి తగిన వైద్య సహాయం అందించి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి సురక్షితంగా చేర్చాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది శీలపాక రాజు, పైలెట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**• గ్రామ సర్పంచ్ రాయని వెంకన్న**






**రాయపర్తి ఏప్రిల్ 22 ప్రజా జ్యోతి**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని గ్రామ సర్పంచ్ రాయని యాకన్న అన్నారు.బుధవారంవరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికిప్రధానోపాధ్యాయులు కొనతం పద్మలత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రాయని యాకన్న, ఉప సర్పంచ్ బుషీరా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాలు, పాఠశాల,విద్యార్థుల విద్యా ప్రగతిపై,పీఎం శ్రీ కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు సవివరమైన నివేదికను సమర్పించారు. ఇదే సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు విజయవంతంగా రాసినందుకు అభినందన సభ కూడా ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు గురించి మార్గనిర్దేశం చేస్తూ, కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్య అతిది సర్పంచ్ యాకన్న తమ ప్రసంగం లో విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులు భవిష్యత్తుకు సం బంధించిన పలు సూచనలు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను గ్రామస్తులను అలరించాయి ఈ కార్యక్రమం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డి స్టాఫ్ సెక్రటరీ వివిఆర్ ఆచార్య ఉపాధ్యాయులు సత్యనారాయణ రఘు శ్యాం సుందర్ శ్రీదేవి నాగరాజు అనిత రాణి భోజ్యా నాయక్ స్వామి ,శివకృష్ణ,ఉషారాణి రాజు ,రమ, వీరస్వామి, స్వరూప మరియు తల్లిదండ్రుల సమక్షంలో విజయవంతంగా ముగిసింది.

## మల్లికార్జున కార్గే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**• పెద్దపల్లి జిల్లా బిజెపి నాయకులు డాక్టర్ మహమ్మద్ రఫీ.**



**మహాముత్తారం,ఏప్రిల్ 22. ప్రజా జ్యోతి** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశిస్తూ "టెర్రరిస్ట్" ఉగ్రవాదితో పోల్చి వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టమని వాటిని పూర్తిగా ఖండిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా బిజెపి నాయకులు డాక్టర్ మహమ్మద్ రఫీ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రధానమంత్రి గురించి ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం.కాంగ్రెస్ పార్టీ అసహనం.మరియు నిరాశకు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో విధానాలపై విమర్శలు సహజం. అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు చేయడం ప్రధానమంత్రి పదవి దేశ గౌరవానికి ప్రతీక.అలాంటి పదవిని లక్ష్యంగా చేసుకొని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశ ప్రజలను ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుంది. జాతీయస్థాయి నాయకులు తమ మాటలలో మరింత బాధ్యతతో వ్యవహరించాలి. దేశాభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని కొత్తదిశగా నడిపించాయి. ప్రపంచంలోనే భారతదేశాన్ని ఒక గొప్ప దేశంగా అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరిచి ప్రపంచంలోనే భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన దేశ ప్రధాని. మరియు ఆర్టికల్ 375 ద్వారా జమ్మూ అండ్ కాశ్మీర్ సమగ్రతను బలోపేతం చేయడం గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ జిఎస్టి అమలు ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వంటి కీలక చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛ భారత్ డిజిటల్ ఇండియా. మేకింగ్ ఇండియా. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచారు. అదనంగా వందే భారత ట్రైన్స్ ప్రారంభం ద్వారా రైల్వే రంగంలో ఆధునికరణకు దోహదపడ్డారు. జీవో 20 సమ్మేట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ వేదికపై భారత దేశ ప్రతిష్టను మరింత పెంచారు.దేశభద్రత ఆర్థిక అభివృద్ధి సంక్షేమం కోసం నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ వెంటనే వివరణ ఇవ్వాలని అలాగే మల్లికార్జున కార్గే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు .దేశ గౌరవం సమగ్రత కాపాడడంలో మాపార్టీ ఎప్పటికీ ముందు ఉంటుందని ఈ సందర్భంగా బిజెపి పెద్దపల్లి జిల్లా నాయకులు డాక్టర్ మహమ్మద్ రఫీ తెలిపారు.

## రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు





**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 22)**నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం రైతులను అక్రమంగా అరెస్టు చేసి బలవంతంగా తమ భూమిలోనికి చొరబడి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రైతు మోరె రవీందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు వద్ద పనులు నిలిపి వేయాలని రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని భూములకు ఇప్పుడు ఉన్నటువంటి మార్కెట్ విలువ ప్రకారము పరిహారం చెల్లించకుండా తమకు తక్కువ పరిహారము చెల్లించడం అన్యాయమన్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్నటువంటి నబాబుపేట గ్రామంలో 27 లక్షల 50 వేల రూపాయలు చెల్లించి మండల కేంద్రానికి కేవలం 22 లక్షల 50 వేలు చెల్లించడం అన్యాయమని రంగపురం గ్రామానికి నోటిఫికేషన్ తర్వాత ఆ గ్రామానికి 21,50,000 నిర్ణయించి మండల కేంద్రానికి 22, 50000/ నిర్ణయించి రైతులకు ప్రస్తుతం ఉన్నటువంటి మార్కెట్ విలువ ప్రకారము ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎన్నో ధర్నాలు రాస్తారోకోలు నిరసనలు చేపట్టిన తర్వాత రంగపురం గ్రామానికి నోటిఫికేషన్ తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటిని పరిగణలోకి తీసుకొని 29,60000/ వేలు,మండల కేంద్రానికి తక్కువ ధర నిర్ణయించడంరైతులను మోసం చేయడం సరైందికాదన్నారు. మండల కేంద్రానికి మిగతా గ్రామాల కంటే ఎక్కువ ధర చెల్లించాలని లేనిచో ఎంతటి త్యాగానికైనా సిద్ధమని అరెస్టు చేసి ఎన్ని రోజులు మమ్ములను ఆపగలరని మా వారసత్వంగా వస్తున్నటువంటి మా తాత ముత్తాతల నుండి మా కుటుంబాలకు జీవనాధారముగా ఉన్న భూమిని కోల్పోవడం చాలా బాధాకరమని వెంటనే కలెక్టర్, ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులతో బలవంతపు భూసేకరణ చేపట్టినటువంటి అధికారులు మండల కేంద్రానికి ఎందుకు వివక్షత చూపుతున్నారని మండల కేంద్రానికి కూడా సరైన ధర నిర్ణయించి న్యాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు బండారి రవీందర్, అరికాంతపు కృష్ణారెడ్డి, కొల్లూరు మనోహర్, స్వప్న, అడ్డూరి రాజేందర్, గుండా బిక్షపతి, గుర్రపు సునంద రెడ్డి, ముదు పు మల్లారెడ్డి,మోరె పద్మ, మోరె అనూష, చిలకామారి బొంద్యాలు, గుర్రపు తిరుపతిరెడ్డి, బోయిన కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**• -జిల్లా ప్రధాన కార్యదర్శి మునీశ్వర్**

**నర్సంపేట ఏప్రిల్ 22( ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకై నర్సంపేట డిపోలో జరుగుతున్న సమ్మెకు మద్దతుగా రాష్ట్ర ఏఐటీయూసీ సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశ్వర్ సిపిఐ జిల్లా నాయకులు హాజరై కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలపడం జరిగింది.సంఘీభావం తెలపడం జరిగింది.ప్రజా రవాణా ప్రైవేటీకరణ వ్యవస్థను అడ్డుకోవడం కోసం ముందు వరుసలో ఉంటామని తెలపడం జరిగింది.. అదేవిధంగా కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన న్యాయమైనహామీలను అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.. మహాలక్ష్మి పథకాన్ని 6 గ్యారెంటీలో భాగంగా రెండు కోట్ల మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలుపరుస్తున్నారు..కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరం..ఎండనక వాననక చలి అనక అధిక పని గంటలు పని చేస్తున్న కార్మికులను ఆదుకోవాల్సింది పోయి చోద్యం చూస్తుంది.. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం 90% కంప్లీట్ అయి ఉంది అపాయింట్మెంట్ డేట్ ఇస్తే సరిపోతుంది దానికోసం ఆలస్యం చేస్తూ కార్మికుల జీవితాలతో ఆటాడుకుంటుంది.. ఇది ప్రజా ఉద్యమంగా మారుతుంది, ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకుంటాము.గుర్తుంచుకోండి ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాంఈ కార్యక్రమంలో డిపో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ లాడే శ్రీకాంత్, తెలంగాణ ఉద్య




మకారుడు వేముల రవి ల అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ఏఐటీయూసీ , సిపిఐ నాయకులకు పేరుపేరునా ధన్యవాదములు


## వానర విలయానికి 'చింపాంజీ' చెక్ సర్పంచ్ హరిప్రసాద్ వినూత్న ప్రయోగం

- **కోతుల కోతకు విరుగుడుగా చింపాంజీ వేషధారణ: ఆదర్శంగా నిలుస్తున్న పంచాయతీ పాలకవర్గం**



**నెక్కొండ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** సాధారణంగా కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ఉచ్చులు, బోనులు, అటవీశాఖ సహాయం వంటి సంప్రదాయ మార్గాలను ఆశ్రయిస్తారు కానీ, నెక్కొండ గ్రామపంచాయతీ మాత్రం సమస్యను వినూత్నంగా విశ్లేషించి చింపాంజీ వేషధారణతో కోతులను తరిమికొట్టే సరికొత్త విధానాన్ని ఆచరణలోకి తెచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. పట్టణంలో కోతుల సంఖ్య గణనీయంగా పెరిగి ఇళ్లపై దాడులు చేస్తూ ఆహార పదార్థాలను నాశనం చేస్తుండటంతో ప్రజలు నిత్యం భయాందోళనలకు గురవుతున్న తరుణంలో, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ తన సృజనాత్మక ఆలోచనతో చింపాంజీ వేషధారణలను ప్రవేశపెట్టగా, పంచాయతీ సిబ్బంది ఈ రూపాల్లో కోతులు తిరిగే ప్రాంతాల్లో సంచరిస్తూ వాటిని సమర్థవంతంగా తరిమివేస్తున్నారు. తమకంటే పెద్ద జంతువును చూసి కోతులు భయపడి వెనక్కి తగ్గుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింగం శ్రావణి–ప్రశాంత్, వార్డు సభ్యులు మెరుగు విజయ్, జెండా రవి, గ్రామ సిబ్బంది సమన్వయంతో పాల్గొని విజయవంతం చేయగా, రాబోయే రోజుల్లో అటవీశాఖతో కలిసి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఒక సాధారణ సమస్యకు అత్యంత సృజనాత్మక పరిష్కారం చూపిన నెక్కొండ పంచాయతీ చొరవ ఇప్పుడు ఇతర గ్రామాలకు సైతం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.

## అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం



**వెంకటాపురం,ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బుధవారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా మబ్బులు కొమ్ముకొని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం సుమారు గంటకు పైగా కురిసింది.అకాల వర్షం కారణంగా కోత దశలో ఉన్న వరి పంటలు ఆరబెట్టిన యాసంగి ధాన్యం, కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి ముద్దయిపోయాయి.కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణ మార్పుతో ఉపశమనం పొందారు. కానీ అకాల వర్షం కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికమైన ఈదురుగాలికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ పనులు చివరి దశలో ఉన్న వరునుడి బారి నుండి రైతు తప్పించుకోలేకపోయాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట పూర్తిగా చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా రైతులకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## మృతురాలు కుటుంబానికి చేయూత



**పర్వతగిరి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన జిల్లా నర్సమ్మ ఆకాలంగా మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అర్షం దర్గస్వామి, యాకయ్య, కుమారస్వామి కలిసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైతులు అధైర్యపడొద్దు.. ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది!

- **నెక్కొండ మక్కల కొనుగోలు కేంద్రంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి భరోసా**



**నెక్కొండ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, రైతులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పర్యవేక్షించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కల కొనుగోలు వేగవంతంగా జరుగుతోందని, ఇప్పటికే రైతులకు అవసరమైన బార్దాన్ బస్తాలను పంపిణీ చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ఆయన, రవాణా కోసం లారీలను కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారని కొనియాడారు. ఇదే క్రమంలో ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మి రైతులు మోసపోవద్దని, గత పదేళ్లుగా ప్రతిపక్షాల మాటలు నమ్మి నష్టపోయిన రైతులు ఇప్పుడు వాస్తవాలను గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంజర్‌పల్లి సర్పంచ్ భూక్యా రమేష్ రాథోడ్, మార్కెట్ డైరెక్టర్ కొత్తపల్లి రత్నం, భూక్యా చిట్టి బాబు, రైతులు, హమాలీలు మరియు దాడువాయిలు పాల్గొన్నారు.

## జయముఖి కాలేజీ విద్యార్థిని అదృశ్యం



**చెన్నారావుపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** జయముఖి విద్యాసంస్థల్లో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. చెన్నారావుపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం గ్రామానికి చెందిన కొడెపాక నిమిషా (19) జయముఖి కళాశాలలో డిగ్రీ చదువుకుంటూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నది.నాన్న వస్తున్నారని చెప్పి.. ఈనెల 18వ తేదీ సాయంత్రం కళాశాల యాజమాన్యం నుంచి నిమిషా తల్లి సౌజన్యకు ఫోన్ వచ్చింది. నిమిష హాస్టల్‌లో లేదని వారు సమాచారం అందించారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే కళాశాలకు చేరుకుని విచారించారు. అదే రోజు ఉదయం 11 గంటల సమయంలో మా నాన్న బయట ఉన్నారు.. కలిసి వస్తాను అని వార్డెన్‌కు చెప్పి నిమిష బయటకు వెళ్లినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఆమె తిరిగి రాలేదు.గతంలో ఓ యువకుడు నిమిషను ఫోన్ ద్వారా వేధిస్తుండటంతో, పెద్దల సమక్షంలో అతడిని మందలించినట్లు బాధితురాలి తల్లి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ యువకుడే మాయమాటలు చెప్పి తన కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం చెన్నారావుపేట పోలీసులను ఆశ్రయించారు.బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు.

## జిల్లా కోర్టు ప్రాంతంలో యూ టర్న్ ఏర్పాటు

- **జిల్లా రవాణాశాఖ అధికారి బారగాడి శ్రీనివాస్ చొరవ**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంతంలో నిత్యం ప్రజల రద్దీ ఎక్కువగా ఉండటం కోర్టు అవసరాల కోసం వాహనాల మీద వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం జరుగుతుంది. దీంతో ఆ ప్రాంతంలో కొంత ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం జరుగుతుంది. అంతేకాకుండా కోర్టుకు వచ్చే వారు కోర్టు దగ్గర డివైడర్ కు యూ టర్న్ లేకపోవడం వల్ల వాహనదారులు రాంగ్ రూట్ లో రావడం జరుగుతుంది. దీనిని గమనించిన ములుగు జిల్లా రవాణాశాఖ అధికారి బారగాడి శ్రీనివాస్ జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఆ ప్రాంతంలో డివైడర్ కు యూటర్న్ ఏర్పాటు చేయాలని భావించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా కోర్టు ప్రాంతంలో డివైడర్ కు యూటర్న్ ఏర్పాటు చేయడం కొరకు రోడ్ సేఫ్టీ లో భాగంగా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ప్రతిపాదించడం జరిగింది.ఈ ప్రతిపాదనలో జిల్లా రోడ్ సేఫ్టీ ఉమ్మడి తనిఖీ శాఖలు ఆర్ అండ్ బి,నేషనల్ హైవే. పోలీస్ డిపార్ట్మెంట్ ,ములుగు మున్సిపల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందించాలి

- **నాయాబ్ తహసీల్దార్ బాబా షేక్ ను కోరిన ప్రజాప్రతినిధులు**



**మహాముత్తారం,ఏప్రిల్ 22. ప్రజాజ్యోతి** చిన్న కాళేశ్వరం పనుల్లో భాగంగా మండలంలోని పోలారం పెద్ద చెరువు రిజర్వాయరు పనుల్లో ముంపునకు గురైన భూములకు నష్ట పరిహారం అందించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ అంబల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం నాయాబ్ తాసీల్దార్ బాబా షేక్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.పోలారం పెద్ద చెరువు రిజర్వాయరు పనుల్లో భాగంగా గతంలో సర్వే నిర్వహించి పట్టా భూములకు మాత్రమే నష్ట పరిహారం ఇచ్చారని తెలిపారు.అదేవిధంగా మిగతా భూములకు కూడా సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందించాలని నాయబ్ తహసీల్దార్ బాబా షేక్ ను గ్రామ రైతులు కోరారు.ఈకార్యక్రమంలో వజినపల్లి సర్పంచ్ మహేష్ పోలారం మాజీ సర్పంచ్ వేల్పుల సరిత తిరుపతి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మంద సుధాకర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ముక్కెర శ్రీకాంత్ వార్డు సభ్యులువేల్పుల అర్జయ్య వేల్పుల ప్రభాకర్ మంద అశోక్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- **గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్**
- **ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు విద్యార్థులకు దుస్తుల పంపిణీ**



**గణపురం ప్రజా జ్యోతి ఏప్రిల్ 22** ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో ఏర్పాటు చేసే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. బుధవారం గణపురం మండల కేంద్రంలోని రెండవ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ రేగూరి సరోజన ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంగన్ వాడి కేంద్రం ద్వారా అందించే పోషకాహారాన్ని వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని తరలించాలి.. పరిహారం చెల్లించాలి





- ఓసి త్రీ ముందు కొండంపల్లి గ్రామస్తుల ఆందోళన
- అధికారులు స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం

**గణపురం ప్రజాజ్యోతి ఏప్రిల్ 22** గ్రామాన్ని తరలించి పరిహారం చెల్లించాలని మండలంలోని ఓసి త్రీ నిర్వాసిత గ్రామమైన కొండంపల్లి గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. గత నెల ఓసి త్రీ ముందు ధర్నా కార్యక్రమం చేపట్టిన సందర్భంగా అధికారులు నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నెలరోజులు పూర్తయిన అధికారులు స్పందించకపోవడంతో తిరిగి బుధవారం ఓసి త్రీ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ బ్లాస్టింగ్ దుమ్ము ధూళితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తమ సమస్యలను సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కలెక్టర్ ఆర్డిఓ సింగరేణి జీవం వద్దకు వెళ్లినా వారు పట్టించుకోవడంలేదని దాటవేత ధోరణి తప్ప తమ సమస్యను పరిష్కరించడం లేదని నిర్వాసితులు ఈ సందర్భంగా అన్నారు. అధికారులందరూ కాలయాపన చేస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదని తమ ఇబ్బందులను ఎవరు పట్టించుకోవడంలేదని వారున్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న గణపురం సిఐ కరుణాకర్ రావు తాసిల్దార్ అడ్లూరి రాజేశ్వరరావు ఎస్ఐ బొరగల అశోక్ సింగరేణి అధికారులు కొండపల్లి గ్రామస్తులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అప్పటి వరకు ఓపికతో ఉండాలని సూచించారు. దీంతో కొండంపల్లి గ్రామస్థులు ఆందోళన విరమించారు.

# అగంతకుల ఘాతుకం తగలబడ్డ మొక్కజొన్న కుప్పలు





- ధర్మ తండా, చెరువుకొమ్ము తండాల్లో భారీ అగ్ని ప్రమాదం..
- లక్షల్లో రైతులకు నష్టం

**చెన్నారావుపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)** కాయ కష్టం చేసి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అగంతకులు చేసిన పనికి రైతన్నలు నిలువునా మునిగిపోయారు. మొక్కజొన్న కుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం సంభవించిన ఘటన పాపయ్యపేట గ్రామ పరిధిలోని ధర్మ తండా, చెరువుకొమ్ము తండాల్లో చోటుచేసుకుంది.

**»› మంటల్లో ఆహుతైన ఆశలు:**

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మ తండాలో రైతులు మొక్కజొన్న సాగు చేసి, పంటను కోసి కుప్పలుగా పోశారు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఈ కుప్పలకు నిప్పంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రతకు తోడు గాలి తోడవ్వడంతో మంటలు వేగంగా వ్యాపించి, పక్కనే ఉన్న మొక్కజొన్న చొప్పకు కూడా అంటుకున్నాయి. కిలోమీటర్ల మేర మంటలు విస్తరించి బీభత్సం సృష్టించాయి.

**»› సొంతంగా పోరాడిన తండావాసులు:**

మంటలు చెలరేగడం గమనించిన తండావాసులు, రైతులు వెంటనే స్పందించి ఇళ్ల నుంచి బకెట్లతో నీళ్లు తెచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అటు చెరువుకొమ్ము తండాలోనూ మంటలు గ్రామ సమీపానికి రావడంతో సర్పంచ్ ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్ల ద్వారా నీటి డ్రమ్ములను తెప్పించి, మంటలు వ్యాపించకుండా అడ్డుకొనేందుకు తీవ్రంగా శ్రమించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సుమారు లక్షలాది రూపాయల విలువైన మొక్కజొన్న పంట కళ్ళ ముందే బూడిదవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతు న్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వ్యక్తులు ఎవరనేది ఇంకా తెలియ రాలేదు. ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట కళ్లముందే కాలిపోతుంటే చూడలేకపోతున్నాం. అప్పులు తెచ్చి సాగు చేస్తే, ఇప్పుడు అంతా బూడిదైపోయింది అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, సర్వే నిర్వహించి తమకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు దీనంగా వేడుకుంటున్నారు.





## టీడబ్ల్యూజేఎఫ్ డైరీ ఆవిష్కరణ

**వరంగల్ కలెక్టరేట్ ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ వర్కింగ్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) 2026 డైరీని వరంగల్ డీపీఆర్వో ప్రేమలత తో కలిసి యూనియన్ నాయకులు ఆవిష్కరించారు ఇటీవల వరంగల్ డీ పీ ఆర్వో గా బాధ్యతలు చేపట్టిన ప్రేమలత ను బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజే ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దయాసాగర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు, పొడేటి అశోక్, కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ నాయకులు మచ్చిక వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్ సురేందర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అనంతుల రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్లు కొమ్ము రాజు, జీ భాస్కర్ రెడ్డి, కుంటమల్ల అరవింద్, సందేల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన ఇన్స్పెక్టర్ సిహెచ్ వెంకటనారాయణ

- \- రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం
- \- అభినందించిన ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి ):** ప్రతి ఏడాది అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొనే విధంగా వివిధ అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా వివిధ హోదాల పోలీసు అధికారుల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించగా, "గ్రౌండ్ లెవల్ పోలీసింగ్ మెరుగుదలకు పోలీసు అధికారుల పాత్ర" అనే అంశంపై జరిగిన అధికారుల విభాగం పోటీల్లో ములుగు జిల్లా నుండి ప్రస్తుతం ఎంటిఓగా విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ సి హెచ్ వెంకటనారాయణ ప్రథమ స్థానం సాధించారు. ఈ విజయానికి గాను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి చేత ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్, ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ ను అభినందించి,భవిష్యత్ లో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## బేలర్ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దేవేందర్‌కు తీవ్ర గాయం



**పర్వతగిరి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండలంలోని పర్వతగిరి గ్రామానికి చెందిన కొల్లూరి దేవేందర్ రావూరు గ్రామ పరిధిలో ట్రాక్టర్ బేలర్ సహాయంతో వరి గడ్డి కట్టలు కట్టే పనికి వెళ్లారు. పని జరుగుతున్న సమయంలో బేలర్ యంత్రంలో సుత్తిల్ దారం చిక్కుకోవడంతో, దానిని సరిచేయడానికి దేవేందర్ ప్రయత్నించారు.ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆయన చేయి బేలర్‌లో ఇరుక్కుపోయింది. సంఘటనను గమనించిన స్థానిక రైతులు వెంటనే స్పందించి ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్ చేసి, ఆయనను బయటకు తీసారు. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఓబీసీ సాధనే లక్ష్యంగా పోరాడాలి..!

- ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒలిగే నర్సింగరావు



**గీసుగొండ,ఏప్రిల్22(ప్రజాజ్యోతి ):**ఆరె కులస్తులకు ఓబీసీ సాధనే లక్ష్యంగా పోరాడాలని ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒలిగే నర్సింగ రావు అన్నారు.మండలంలోని కొనాయిమాకుల గ్రామంలో ఆరే సంక్షేమ సంఘం నాయకులు జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం నాయకులు ఇంగ్లీ శివాజీ,సుకినే రాజేశ్వరరావు,జిల్లా సంఘం నాయకుడు గుండెకారి రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరె సమాజం అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగాలని,ప్రభుత్వ పరంగా హక్కులు సాధించేందుకు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం జిల్లా కమిటీని ప్రకటించారు.జిల్లా ప్రధాన కార్యదర్శులుగా తుమ్మనపెల్లి శ్రీనివాస్,డోలె చిన్ని,గుండెకారి జగన్,కౌడగాని తిరుపతి, కోశాధికారిగా కౌడగాని మోహన్ రావు,ఉపాధ్యక్షులుగా సిరిసే రాజేశ్వరరావు,లాండే రమేష్,పుస్కూరి ధర్మేంద్ర, కుసుంభ రఘుపతి,కొల్లూరి రవీందర్,నాగంపల్లి కిరణ్ కుమార్,ప్రచార కార్యదర్శులుగా దౌలత్ బాజీ యుగేందర్,నాయికోటి అంజి బాబు హింగే రాజేశ్వరరావు, సిర్ల రవీందర్,హుస్సేన్ పల్లి విరాట్,బెంబిరే మలహర్ రావు,అంబరగొండ రాజు నియమితులయ్యారు.కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## సిపిఐ 57వ ఆవిర్భవ, మార్టిస్ట్ మావో ఉపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ 156 వ జయంతి



**నర్సంపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి )** నర్సంపేట పార్టీ ఆఫీస్ ఆవరణలోసిపిఐ (ఎంఎల్ ) పార్టీ జెండాను కామ్రేడ్ మొగిలి ప్రతాపరెడ్డి రాష్ట్ర కార్య వర్గ సభ్యుడుఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్ ) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మొగిలి ప్రతాప్ రెడ్డమాట్లాడుతూ భారత విప్లవోద్యమాలో ఎంతో చారిత్రక ప్రాధాన్యత అని అన్నారు.భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన మహాతర వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన రెండు దశాబ్దాల తర్వాత నక్సల్ బరి వసంత మేఘం గర్జించింది విప్లవ కెరటమై ప్రజలను సంఘటితంగా ముందుకు కదిలించింది ఆ సందర్భంలోనే మార్టిస్ట్ మావో ఉపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జన్మదిన రోజు ఏప్రిల్ 22 న సిపిఐ (ఎంఎల్ ) ఏర్పడి భారత విప్ల ఉద్యమానికి దశ దిశ నిర్దేశించింది అని గుర్తు చేశారు.రివిజనిజం నయా రీవిజ నిజ నడ్డి విరగొట్టి భారత దేశ విముక్తి కోసం ప్రజాయుద్ధపందను ప్రధాన ఏజెండగా ముందుకు తెచ్చి విద్యార్థులను యువకులను కార్మికులను కర్చకులను సంఘటిత పరిచే విప్లవద్యంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి లాంటి ఎందరో నాయకత్వంలో ఉద్యమంలో ముందు భాగా న నిలబెట్టారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో గోలి శ్రీనివాస్,కొమ్ముక రవి, సోమయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ లెనిన్ 157 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు



**పాలకుర్తి ఏప్రిల్ 22/ప్రజాజ్యోతి /** ప్రపంచ సోషలిస్టు వవ్యస్థపక నిర్మాత,మార్క్సిస్టు మహోద్యమలలో ప్రజల పక్షణ నిలిచిన కామ్రేడ్ లేనిన్ 157 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు నల్ల నరసింహులు విగ్రహం వద్ద లెనిన్, భారత విప్లవోద్యమ నిర్మాత సిపిఐ ఎంఎల్ లిబరేషన్ సృష్టికర్త కామ్రేడ్ చారు మజుందార్ చిత్రపటా లకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మండల కార్య దర్శి కళింగరాజు అధ్య క్షత వహించిన సమా వేశంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతోజు రజిత పాల్గొని మాట్లాడు తూ ప్రపంచ దేశాల్లో శ్రామిక వర్గాల రాజ్యాధి కారం కోసం లెనిన్ నాయకత్వంలో 1917 నుండి 1991 వరకు రష్యాలో అప్రతిహత సోషలిస్టు వ్యవస్థను నిర్మించి సోషలిస్టు వ్యవస్థ యొక్క ఫలితాలు ప్రజలకు అందించరని, ప్రపంచంలో అనేక విప్లవాలకు నాంది పలికిందని అన్నారు.ఈ కార్యక్రంలో నాయకులు మహంకాళి శ్రీనివాస్. మండల కార్యదర్శి కొనకటి కళింగరాజు, గ్యార రాజు. కార్తీక్. తుర్పాటి సారయ్య. లక్ష్మన్ తదితరులు పాలుగోన్నారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినులకు ఉపాధ్యాయుల ఆసరా

- రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేత
- అమీనాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల మానవత్వం



**చెన్నారావుపేట ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)**

నిరుపేద విద్యార్థినుల పట్ల అమీనాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం తమ ఉదారతను చాటుకున్నా రు.తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన విద్యార్థినుల కుటుంబానికి అండగా నిలిచారు.వివరాల్లోకి వెళ్తే.వరంగల్ జిల్లా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినులు కుక్కల సింధు, రమ్య గతంలోనే తల్లిని కోల్పోయారు. కాగా, ఇటీవల తండ్రి కూడా మరణించడంతో ఆ పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అమీనాబాద్ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టే జ్యోతి, ఉపాధ్యాయ బృందం మోడల్ స్కూల్ ఇతర సిబ్బంది బుధవారం ఉప్పరపల్లిలోని వారి నివాసానికి వెళ్లారు. తుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.బాధిత విద్యార్థినుల చదువుకు, తక్షణ అవసరాలకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో ప్రిన్సిపాల్, టీచింగ్ మరియు నాన్-టీచింగ్ స్టాఫ్ తమ వంతుగా సేకరించిన రూ. 15,000 నగదును విద్యార్థినులకు అందజేశారు. గురువులే తల్లిదండ్రులై ఆదుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరిబాబు, రాజేంద్రప్రసాద్, షరీఫ్, మహేందర్, రవి, సురేష్, మంజుల మరియు నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంద క్రిష్ణ మాదిగ ఫోన్ కాల్ తో స్పందించిన అల్లం స్వప్న-బాలకిషార్ రెడ్డి

**గీసుగొండ,ఏప్రిల్22(ప్రజాజ్యోతి ):**ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు స్వర్గీయ సుబ్బు (సుబ్బయ్య మాదిగ )కుమార్తె వివాహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త,జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లం స్వప్న–బాల కిషోర్ రెడ్డి (ABR) మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు.ఇటీవల మరణించిన సుబ్బు కుటుంబ ఆర్థిక పరిస్థితిని,ఆయన కుమార్తె వివాహ నిశ్చయ తాంబూలాల విషయాన్ని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అల్లం స్వప్న –బాల కిషోర్ రెడ్డి తో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని వివరించారు.సుబ్బు పార్టీకి ఎంతో సేవ చేసిన నాయకుడని,ఆయన కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన ఏబీఆర్ దంపతులు,సుబ్బు కుమార్తె వివాహ ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ. 15,000 (పదిహేను వేల రూపాయలు ) ఆర్థిక సహాయాన్ని ప్రకటించి, కట్ల రాజశేఖర్ ఫోన్ పే ద్వారా సుబ్బు కుటుంబానికి అందజేశారు.భవిష్యత్తులో సుబ్బు కుటుంబానికి అండగా ఉంటామని బాలకిశోర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సుబ్బు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కష్టకాలంలో పెద్దన్నలా స్పందించిన మంద కృష్ణ మాదిగ,పెద్ద మనసుతో ఆర్థిక సహాయం అందించిన అల్లం స్వప్న – బాల కిషోర్ రెడ్డి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా వాడాలి

- సూపర్వైసర్ నాగరాణి




**మహాముత్తారం,ఏప్రిల్ 22. ప్రజాజ్యోతి** మండలంలోని పోలారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైసర్ నాగరాణి ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు.తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు, బాలింతలకు వివరించారు.అదే విధంగా గ్రామంలోని పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి సెంటర్‌లో అందించే సేవలను వినియోగించుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా వాడాలని కోరారు. అనంతరం పిల్లలకు ఫ్రీ స్కూల్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ నాగమణితో పాటు సర్పంచ్ అంబాలా రాజబాపు, పంచాయతీ కార్యదర్శి సంపత్ , వార్డు సభ్యులు ఏనుగు మౌనిక రాజేందర్, వేల్పుల రాజేశ్వరి సంతోష్, ఆశాంపెల్లి మధుకర్ ఏఎన్ఎం సంధ్య, ఆశ వర్కర్ మమత వివో అధ్యక్షులు చంద్రగిరి స్వరూప, అంగన్వాడీ కార్యకర్త వేల్పుల కౌసల్య , ఆయా తల్లి తండ్రులు, గర్భిణి స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## భాదిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



**గీసుగొండ,ఏప్రిల్22(ప్రజాజ్యోతి):**మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు.మండలంలోని కొనాయిమాకుల గ్రామానికి చెందిన గుండెకారి గట్టయ్య ఇటీవలే మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం ఉదయం వారి నివాసానికి వెళ్లి,గట్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ధైర్యం చెప్పారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.రాంపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తాబేటి సదానందం ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు.ఈ విషయం తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి సదానందంని పరామర్శించి,ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి వెంట ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం రఘు,మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు సిరిసే శ్రీకాంత్,గజ్జి రవి,పత్తిపాక నారాయణ,బోడకుంట్ల ప్రకాష్,జాహిరుద్దన్,ఎద్దు శ్రీను,లింగమూర్తి,కార్యకర్తలు,అనుబంధ సంఘాల నేతలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హత్య కేసులో నిందితుడు అరెస్ట్

**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (ఏప్రిల్ 22)**మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన చిలువేరు పోషయ్య హత్య కేసులో నిందితుడు ఇనుగాల కుమారస్వామిని బుధవారం అరెస్ట్ చేసినట్లు చిట్యాల సి ఐ మలేష్, ఎస్సై ముప్పు సురేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన చిలువేరు పోశయ్య (66) పై పాత కక్షల కారణంగా ఈ నెల 4 న ఇనుగాల కుమారస్వామి కర్రతో దాడి చేయగా,చికిత్స పొందుతూ ఈ నెల 18 న వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో మరణించారు. ఈ మేరకు మృతుని భార్య ఫిర్యాదు ఆధారంగా BNS సెక్షన్ 103 కింద కేసు నమోదు చేశారు.దర్యాప్తులో బాగంగా చిట్యాల సి.ఐ, ఎస్.ఐ సిబ్బందితో కలిసి బుధవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి గుడి వద్ద అరెస్ట్ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సి ఐ తెలిపారు.



# తల్లిదండ్రులు లేని పిల్లలకు గ్రామస్తుల భరోసా

- రూ.54 వేల ఆర్థిక సాయం.. పోస్టల్ డిపాజిట్
- మానవత్వాన్ని చాటుకున్న చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి



**చెన్నారావుపేట ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** విపత్కర పరిస్థితుల్లో తోటివారిని ఆదుకోవడంలో తాము ఎప్పుడూ ముందే ఉంటామని వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామస్తులు మరోసారి నిరూపించారు. అమ్మానాన్నలను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరు ఆడపిల్లలకు అండగా నిలిచి, ఊరంతా ఒకే కుటుంబమై మానవత్వాన్ని చాటుకున్నారు.గ్రామానికి చెందిన కుక్కల రాజు ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఆయన భార్య సరిత కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. వీరి మరణంతో ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కుమార్తెలు రమ్య, సింధు ఒక్కసారిగా అనాథలయ్యారు. అమ్మానాన్న లేని లోటు, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న ఆ చిన్నారుల దీనస్థితిని చూసి గ్రామస్తుల మనసు ద్రవించింది.

ఈ విషయాన్ని గమనించిన ఉప్పరపల్లి గ్రామ ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ దారుల సంఘం సభ్యులు కుక్కల కుమార్, పరికి మధుకర్ వెంటనే గ్రూప్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లారు. పిల్లల చదువు ఆగిపోకూడదన్న సంకల్పంతో దాతల నుంచి సాయాన్ని కోరారు. స్పందించిన 57 మంది దాతల సహకారంతో మొత్తం రూ. 54,000 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని రమ్య, సింధుల విద్యా అవసరాల కోసం పోస్టల్ శాఖలో డిపాజిట్ చేస్తున్నట్లు ప్రభుత్వ ఉపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. సమాచారం తెలియగానే స్పందించి సాయం అందించిన ఉప్పరపల్లి హైస్కూల్, అమీనాబాద్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ఆటో యూనియన్ సభ్యులు చేసే సేవలు ఉప్పరపల్లి చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శం కావాలని ఊడుగుల శ్రీనివాస్ (కేర్ హాస్పిటల్ యజమాని) మహమ్మద్ షరీఫ్ అన్నారు.తమకు కొండంత అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రమ్య, సింధు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సేవా కార్యక్రమంలో ఊడుగుల శ్రీనివాస్, మహమ్మద్ షరీఫ్, కుక్కల చేరాలు, పరికి మధుకర్, రుద్ర రాజు, మెరుగు హరి, కుక్కల కుమార్, వార్డు మెంబర్ కుక్కల మమత సాంబ రాజు,అమీనాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు చిలువేరు మహేందర్, చౌదారపు రవి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొని పిల్లలకు ధైర్యాన్ని ఇచ్చారు.

# ఇండియా కూటమి ఎంపీలకు కృతజ్ఞతలు

- ములుగు జిల్లా ఉపాధ్యక్షులు దనపనేని వెంకటేశ్వర్లు



**వెంకటాపురం,ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):** పార్లమెంట్లో ఈనెల 17న మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించి వీగిపోయే విధంగా ఓటు వేసిన ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలకు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..131వ రాజ్యాంగ సవరణ బిల్లును మహిళా రిజర్వేషన్ అనే బిల్లు మాటున పార్లమెంటులో ప్రవేశపెట్టిన తీరును ఇండియా బ్లాక్ పార్టీల ఎంపీలు తీవ్రంగా ప్రతిఘటించి సమర్థవంతంగా ఎదుర్కొని దేశాన్ని,మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఉపద్రవాన్ని తొలగించారని అన్నారు.గత ప్రధానులు ఇందిరా,వాజ్ పేయి ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేపట్టిన దక్షిణాది రాష్ట్రాలు డిలిమిటేషన్లో నష్టపోకూడదని రాజ్యాంగ సవరణ ద్వారా సీట్ల పెంపును దేశ ప్రయోజనాల దృష్ట్యా నిలిపివేశారని తెలిపారు.కానీ ప్రస్తుత ఎన్ డి ఏ ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం జనాభా సాకుతో ఉత్తరాదిన సీట్లు పెంచి పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని నామమాత్రం చేయాలని కుట్రలను తమ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజ్యాంగ సవరణ చేసి సుస్థిరం చేసుకోవాలనే దురుద్దేశాన్ని ఇండియా బ్లాక్ పార్టీలు తిప్పి కొట్టాయని అన్నారు. ఇండియా బ్లాక్ ఎంపీలను సంఘటితం చేసిన కన్వీనర్ అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ,ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి ధనపనేని వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్ తో రెండు ఎకరాల మొక్కజొన్న దగ్ధం





- రూ. 2 లక్షల రూపాయలు నష్టం
- కన్నీరుమున్నీరవుతున్న రైతు భాషమియా..
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

**చెన్నారావుపేట ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి)** చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ రైతుకు తీరని నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు ఎండి. భాషమియా తనకున్న రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికి వచ్చే తరుణంలో బుధవారం ప్రమాదవశాత్తు పొలం పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి.దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి మొక్కజొన్న తోట వ్యాపించాయి. మంటలను గమనించిన చుట్టుపక్కల రైతులు వెంటనే స్పందించి వాటిని ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే సుమారు రెండు ఎకరాల పంట పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నారు.పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను (లూజ్ లైన్స్) సరిచేయాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం వల్లే తనకు ఈ గతి పట్టిందని రైతు భాషమియా ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట కళ్లముందే కాలిపోవడంతో తన కుటుంబం రోడ్డున పడిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె కు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

- ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల ను రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి వెంటనే పరిష్కరించాలి.
- మంత్రి పొన్నం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలి.



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 22:** భూపాలపల్లి ఆర్టీసీ డిపో ముందు జరుగుతున్న నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పాల్గొని ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కార్మికుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని అన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చర్చలు ప్రారంభించాలని కోరారు.

# ఉపాధి వేతన లక్ష్యాలను చేరుకోవాలి ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, వేగం పెంపు

- మండల పనితీరుకు ఎంపీడీవోలదే బాధ్యత
- పనుల వద్ద మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించి, దినసరి వేతనం అందేలా చూడాలని, నిర్దేశించిన లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాల్సిందేనని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, నిర్వహణపై జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 12 మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 71,415 పనులు చేపట్టగా, 1,14,555 మంది కూలీలకు ఉపాధి కల్పించినట్లు తెలిపారు. పనుల కొలతలు పూర్తి చేసిన తర్వాత 72 గంటల్లోనే రికార్డు బుక్ లలో నమోదు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పనులను తరచుగా పరిశీలించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు వారానికి ఒకసారి పనుల పురోగతిని తనిఖీ చేసి, నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఎంపీడీవోలు మండల స్థాయి పనితీరుకు బాధ్యత వహించాలన్నారు. పనుల వద్ద తాగునీరు, షెడ్లు, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మస్టర్ రోల్స్, వేతన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఫీల్డ్ ఆడిట్లు నిర్వహించి, మట్టి వర్గీకరణ, కొలతలు ప్రక్రియలను ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. కొలత రికార్డులు, ఎన్ ఎంఎంఎస్ యాప్ లో తప్పనిసరిగా రోజూవారి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. వేతన రేట్లు, హాజరు నమోదు వివరాలను నమోదు చేయాలని సూచించారు. పనుల నాణ్యతను పెంపొందించేందుకు ఉత్తమ స్థాయిలో ఉన్న పనులను గుర్తించాలన్నారు. పనులు చేసే కూలీలు వారు చేసిన పనికి అనుగుణంగా సరైన వేతనం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఎక్కువ పని చేసిన వారికి తగిన విధంగా చెల్లింపులు ఉండాలన్నారు. ఇంకా, ఎన్ఓపీఎస్ పనులకు సంబంధించి సగటు లెక్కింపు చేయడం ద్వారా పనుల ప్రగతిని అంచనా వేయాలన్నారు. పనుల ఖచ్చితత్వం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎటువంటి లోపాలు లేకుండా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. పని అవసరాన్ని బట్టి కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు, పనులు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని, పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పనుల లభ్యతను పెంచి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఉదయాన్నే పనులు ప్రారంభించాలని, పనుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, వారానికి రెండు సార్లు చేపట్టిన పనులకు సంబంధించిన కొలతలను తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో మంజూరయ్యే పనులు ఆరు నెలల ఆవశ్యకత కలిగి ఉండాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంచార్జి డీఆర్డీఓ నూరుద్దీన్, అడిషనల్ డీఆర్డీఓ చంద్రశేఖర్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంను సందర్శించిన ఎంసిహెచ్ ఆర్ డి శిక్షణ అధికారులు



**వెంకటాపూర్ ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి ):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని బుధవారం సెంట్రల్ సెక్రటరీ సర్వీస్ ఏఎస్ఓలు సందర్శించారు. హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకోనగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర,శిల్పకళా వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.వారి వెంట టూరిజం సిబ్బంది,టూరిస్ట్ పోలీసులు,శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి,పోలీస్,రెవెన్యూ,పురా వస్తు,దేవాదాయ,టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

- జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్



**వెంకటాపురం,ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి ) :** భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం వెంకటాపురం మండలంలోని మల్లాపురం గ్రామంలో మడకం ప్రశాంత్ అధ్యక్షతన ఆదివాసి యువతతో ఏర్పాటుచేసిన సమావేశంలో సాయి పాల్గొని మాట్లాడుతూ..భద్రాచలంలో ఆదివాసి న్యాయకలశాల ఏర్పాటు అయితే యువతకు ఆదివాసి చట్టాలపై అవగాహన ఉంటుందని తమ భూములకు రక్షణగా ఉంటారని అన్నారు.జిఎస్పి పోరాట ఫలితంగానే భద్రాచలంలో డిగ్రీ ఎస్ఎంఎస్ హాస్టల్,బీఈడీ కళాశాల సాధించుకున్నామని,అలాగే భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాల సాధిస్తామని అన్నారు.రాష్ట్ర విభజన అనంతరం గత ప్రభుత్వం హాయంలో భద్రాచలం నియోజకవర్గం రాష్ట్రంలోని అతిపెద్ద ఆదివాసి నియోజకవర్గమని, టిఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీలను ముక్కలు చెక్కలుగా విభజించి పాలించారని గుర్తు చేశారు.1976లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఓటు బ్యాంకు కోసం ఎమర్జెన్సీలో లంబాడీలను ఎస్టీ జాబితాలో కలిపి ఆదివాసులకు తీరని అన్యాయం చేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.షెడ్యూల్ ఏరియాలో ఆదివాసి చట్టాలను అమలు చేయాలని,ఆదివాసి ఎమ్మెల్యేలు ఆదివాసి రిజర్వేషన్ తోని గెలుపొంది ఆదివాసి చట్టాలను అమలు చేయాలని ఏ రోజు కూడా అసెంబ్లీలో మాట్లాడలేకపోవడం చాలా బాధాకరమని అన్నారు.న్యాయ కళాశాల ఏర్పాటు చేసేవరకు ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆదివాసి యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మడకం పాపారావు,పండ,అరుణ్ పండ,గణపతి,పండ,శ్రీను మడకం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

- ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి
- దివంగత మిత్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం
- ముందుకు వచ్చిన మహిళలు,యువత



**వెంకటాపురం,ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి ):** అమ్మ జన్మనిస్తే మనంచేసే రక్తదానం ఆపదలో ఉన్న వారికి పునర్జన్మను ప్రసాదిస్తుందని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ కొప్పుల మురళి అన్నారు.బుధవారం వెంకటాపురం మండల పరిధిలోని రంగరాజపురం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.దివంగత మిత్రులు శ్రీకాంత్, తుమ్మ కార్తిక్,కోడిరెక్కల అన్వేష్,రాయవరపు ప్రకాష్ జ్ఞాపకార్థం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు.ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణీ స్త్రీలు, తలసేమియా,సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్నారులకు అత్యవసర సమయాల్లో రక్తం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కొప్పుల మురళి మాట్లాడుతూ..వేసవి కాలంలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు తగ్గి రోగులు ఇబ్బంది పడుతున్న తరుణంలో యువత ఇలా ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ శిబిరంలో యువకులతో పాటు మహిళలు సైతం స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం వారిలోని సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. అనంతరం రక్తదానం చేసిన 21 మంది దాతలకు ప్రశంసా పత్రాలు, షీల్డ్లను అందజేసి వారిని సత్కరించారు.ఈ సేవా కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశిష్,ల్యాబ్ టెక్నీషియన్ పార్థ,ట్రస్ట్ సభ్యులు కిరణ్,నాగార్జున,భార్గవ్,మహేష్, నిర్మల,రంగరాజపురం కాలనీ యూత్,ఆశా వర్క ర్లు,స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన జిల్లా టిఆర్పి అధ్యక్షుడు రవి పటేల్



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, ఏప్రిల్ 22.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టి జి ఎస్ ఆర్ టి సి జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి డిపో ముందు జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పాల్గొని కార్మికులకు పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డిపో ముందు కార్మికులతో కలిసి కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ రవి పటేల్ గారు ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు కీలక డిమాండ్లు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణలో 30% ఫిట్మెంట్ అమలు చేయాలని, అలాగే 2025 వేతన సవరణను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ప్రతి నెల ప్రభుత్వం ఆర్టీసీకి ₹ 400 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ట్రేడ్ యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని, కార్మికులపై ఉన్న పనిభారం తగ్గించాలని ఆయన పేర్కొన్నారు.ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి వెంటనే ఆర్టీసీకి అందించాలని, అద్దె బస్సు డ్రైవర్లను ఆర్టీసీలో విలీనం చేయాలని, అధిక సంఖ్యలో బస్సులను పునరుద్ధరించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు ఇచ్చిన సమ్మె నోటీసులో పేర్కొన్న అన్ని న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని రవి పటేల్ గారు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని, కార్మికుల న్యాయపరమైన పోరాటంలో తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రవి పటేల్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, జిల్లా కార్మిక సంఘం నాయకులు, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతల సంపత్, జిల్లా కోశాధికారి జిలకర శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు వైద్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం జూగా పథకంతో గిరిజన ఆవాసాలకు వెలుగులు..!

- ఎన్ పిడిసిఎల్ చీఫ్ ఇంజనీర్ జె.ఆర్.చవాన్



**సంగెం,ఏప్రిల్ 22(ప్రజాజ్యోతి ):** కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పీఎం జుగ పథకం ద్వారా లంబాడా,గోండు,గిరిజన,ఎరుకల సామాజిక వర్గాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు,లైన్లు వేసి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ఎన్ పిడిసిఎల్ చీఫ్ ఇంజనీర్ (కన్స్ట్రక్షన్) జె.ఆర్.చవాన్ తెలిపారు. బుధవారం రోజున గీసుకొండ మండలం సూర్యతండా గ్రామంలో సర్పంచ్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో గీసుకొండ,సంగెం మండలాలకు సంబంధించిన గిరిజన ప్రజాప్రతినిధులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ పిడిసిఎల్ చీఫ్ ఇంజనీర్ జె.ఆర్.చవాన్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం విద్యుత్ సౌకర్యం లేని ఆవాసాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ స్కీమ్ ను అమలు చేస్తోందని వివరించారు.గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని గిరిజన ఆవాస 1260 ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు.ఎన్ పిడిసిఎల్ పరిధిలోని 18 జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పథకం కింద ఎటువంటి ఖర్చు లేకుండా లైన్లు వేసి,మీటర్లు అమర్చి విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు.గీసుకొండ, సంగేం మండలాలకు సంబంధిత సర్పంచులు ప్రతిపాదనలు అందించాలన్నారు.గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు,స్మశాన వాటికలు,మంచినీటి అవసరాలకు కూడా ఈ స్కీమ్ ద్వారా ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చీఫ్ ఇంజనీర్ తెలిపారు.వరంగల్ ఎస్.ఈ ఆనందం మాట్లాడుతూ..కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాగుతున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి గిరిజన కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డి.ఇ(కన్స్ట్రక్షన్)జాటోత్ హర్జి నాయక్,ఏ.డి.ఇ బానోత్ రవినాయక్, ఏ.డి.ఇ (కన్స్ట్రక్షన్) జానకి రాంరెడ్డి, ఏఈలు,సబ్ ఇంజనీర్లు సర్పంచులు వీరేందర్,జ్యోతి,వీరన్న,కేలోతు బిక్షపతి, ప్రవీణ్,బాదావత్ నర్సింహనాయక్,వినోద,సంధ్య,వెన్నెల,గుగులోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి మోడల్ స్కూల్ లో ఇంటర్ ఫలితాలు దారుణం

- రాష్ట్రంలోనే కనిష్ట ఉత్తీర్ణత శాతం నమోదు
- ప్రిన్సిపాల్ కు షోకాజ్ నోటీస్ జారీ

**పర్వతగిరి, ఏప్రిల్ 22 (ప్రజాజ్యోతి )** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ / జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి. సెకండియర్ లో 79 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం 16 మంది మాత్రమే ఉత్తీర్ణులు అయ్యారు. ఫస్ట్ ఇయర్ లో 68 మంది పరీక్షలకు హాజరుకాగా, 11 మంది మాత్రమే పాస్ కావడం గమనార్హం. ఈ ఫలితాలతో రాష్ట్రంలోనే అతి తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు చేసిన కళాశాలగా ఈ మోడల్ స్కూల్ నిలిచింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విద్యార్థుల ఫలితాలు పాఠశాల నిర్వహణ లోపాలను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.పాఠశాల నిర్వహణ, బోధన ప్రమాణాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

